కథ

# పోపూరీ

## కాశీభట్ల వేణుగోపాల్

బొగ్గు బావిలో సారా పొర కప్పుకున్న ఇజిగిరి రాజమల్లు చేతిలో పారకు బదులు సితార... పలికించిన మారూ బిహాగ్ రాగ తరంగిణి... కళాకారుడికి ప్రముఖుల కారిడార్లే అవసరంలే...

కారడవుల్లోనైనా సరే...

చీకటి సొస్వరంగాల్లోనైనా... సరే...

ఎక్కడైనా...

ఎప్పుడైనా...రాగాలతో సరాగాలడగ్రలు...

సైడింగ్ క్లర్కు భాగవతమింట్లో బొబ్బిలి వీణను చూసి తబ్బిబ్బై...

తీగలపై మొరటు వేళ్లతో అలవోకగా తాకి తాను తరించి... ఆ చిన్ని ఇంట రాగపు పంట... పండించి...

నా గుండెల్లో మంట రగిలించి...

ఎక్కడున్నాడో?

అసలున్నాడా?

ఊహూ... అస్సలవకాశం లవలేశం లేదు...

ద్రవఖడ్గంతో హరాకిరీ చేసుకుని... రాగాల్లో ఆ రక్కసి బొగ్గు నల్ల రంగులో కల్సిపోయుంటాడు...

** ** **

"గుడీవినింగ్సర్"

వెల్తురూ చీకటీ కాని బూడిద వర్ణంలో విరిసిన హరిధనుసు... వినోదిని... నాద వినోదిని...

"హాయ్ కమానిన్... హౌకం అట్ దిస్ ఆడవర్"

ఆవెను పారదర్శకం చేస్తూ... చూస్తూ...

"ఆంటీ రమ్మన్నారు"

ఆంటీ నాకన్నిటికీ యాంటీ...

"హో అయ్ డింట్నో, లోపల వున్నట్టుందావిడ"

నన్నలవోకగా తాకి... నా నరాలనిండా పాకి... ఆ పరిమళం... అలా ఇజిగిరి రాజమల్లు సింగరేణి కార్మికుడి రాగాల హంగుల్లోంచీ... ఆ అడవులు దాటి... ఇంకా చిక్కని కోరికల కారడవుల్లోకి ప్రస్థానం...

కలల కోరికలు...

కోరికల కలలు...


అశరీరమైన కలలు...

కలివిడి కలలడవుల్లో సంచరిస్తున్న నా పారభౌతిక అస్తిత్వపుటం చున ఎవరో హృదయశూన్యంగా నించొని...

"కమౌట్ వితజ్ వియ్ విల్ డైనౌట్"

ఓ కల ప్రాణం పోసుకుని భ్రూణాకృతిలో ఊహల మాయా జలాల్లో...

** ** **



ఎవరికెవరు ఏమిచ్చుకుంటున్నాం... అసలు ఎవరేనా ఎవరికేనా యెందుకేమేనా యివ్వాలి...

కలిసుంటున్నాం కాబట్టా?

కలిసుంటున్నాం...!

వాటె రిడిక్యులస్ టర్మ్! కల...వ...టం! ఇద్దరి బెడ్రూములూ వేరై యుగాలైంది...

ఎప్పుడు? యే యుగమది?

ఓ స్వప్న చిత్రం కాలి బుడిదైన కాలమది...

నా చరిత్రలో ఓ స్టోనేజ్...

అవును రాతి యుగమది...

నా సితారు తారను తెంచి రాగాలు కలిసికట్టుగా ఉరిపెట్టుకు కొట్టుకు చచ్చిన యుగమది...

నా కాలిపోయిన కాలం గురించి, కాలం కాని కాలంలో ఆలోచించడం మౌఢ్యం!

"వియ్ విల్‌స్టాపిట్ గుంతర్స్"

'అయామె బిబ్లీయ మేనియక్... అయ్ డైఫర్ బక్స్...' అస్సలు చదవని పుస్తకాలెన్నో ఆ ర్యాకుల నిండా... కొన్న వెంటనే ఆ పుస్తకాల చివర్లని ఆమె వేళ్ళ అలవోకగా తాకి తిప్పేస్తాయంతే... శవపేటికల్లో భద్రపర్చ పడిన బతికిన భావాలే భావనలే ఇంటినిండా....

నాదవినోదిని నడుము బావుంది...

ఆ అమ్మాయి చీరకట్టిన తీరు మరీ బావుంది...

"యేమి మోహమిది నరుడా...!

కన్నది... విన్నది... మాయని కనుగొన్నది ఎవడురా...

కాంతయని యేవు

కనకమ్మని యేవు

కడతేరు కాలమ్ము కనవేలరా

యేమి మోహమిది నరుడా"

నాన్సెన్స్...

ప్రతొక్కడూ బైరాగైతే... మానవ జాతి కొనసాగేదెలా...

షీర్ నాన్సెన్స్...

నాదవినోదిని నడుము మడత బావుంది....

'మనిషి లోపలె పెద్ద మడత వున్నది' కృష్ణశాస్త్రీ

మూగబోయిన గొంతుకతో యెన్ని మడతల్ని విప్పాలని అనుకున్నా ఓ ఘనీభవించిన ఖేదమా...

"హ్యావె కోక్సర్" సేల్స్‌గాల్...

రోజుకెంతమ్ముతావమ్మాయీ....

"నో థాంక్స్"

ప్రతీ సంబంధమూ ఓ వ్యాపార సంబంధమై కూచుండిపోయింది...

"లైక్డు హ్యావ్ ఎనీథింగెల్స్... సర్?"

వద్దన్నట్టు తలాడించా...

స్టేజీ మీద నిష్క్రమించినట్టు.... వెనక్కి కాస్తా దూరం నడుస్తూ వెళ్లిందా అమ్మాయి...

ఎటికెట్... దాని గురించి క్లాసులూ...

ఆ క్లాసులకు మళ్లీ కాసులూ...

అవునవును ప్రతి సంబంధమూ వ్యాపార సంబంధమవుతోంది... తను వ్యాలెట్ తెరిచి బిల్ కట్టి... నావేపు తిరిగి... "పోపూరీ" అంది...

"ధాబా కెళ్దాం.... ఈవినింగ్ ప్లెజంట్‌గా వుంది" నేను...

"అలాగని కాదు రావ్ ఫ్యామిలీ తోటి వస్తానన్నాడు తనే టేబిల్స్ రిజర్వ్ చేస్తానని చెప్పాడూ"...

ఓహో గతంలోనే నిర్దేశించబడిన నా భవిష్యత్తనమాటిది... యేదోలే కాస్త ఉపశమనం కలిగిస్తూ నాదవినోదినుంది...

మరి రేపో?!

** ** **

పోపురీ...

కలగూర గంప...

కలగాపులగపు కిచిడీ...

మెత్తటి కార్పెట్....

అంతకన్నా మెత్తటి చీకటి కాంతి...

చిన్ని టేబిల్స్...

వాటి మీదకి వేళ్ళాడే మసక బల్బులు...

గుసగుసలు గొంతుకల సంభాషణలూ...

వినెగర్ వాసనా... విస్కీ వాసనా కలగలసి... కస్తమర్లు పొరలుగా ధరించిన పర్ఫ్యూమ్‌లు... అన్నీ కలిసి కలగలసి...

పోపురీ...

చీకట్లోంచీ చిద్విలాసంగా ప్రత్యక్షించిన రావ్

"దిస్ వే ప్లీజ్... హెలోసర్... హెలో మిస్ వినోదినీ ఇటువేపే దొరి కాయి టేబిల్స్... అయ్ వజ్ అ లిటిల్‌బిట్ లేట్"

'హీ' 'షీ'లకి పక్కన టేబుళ్లు...

వాటిని పాయఖానాలనరాదు...

టోయ్‌లెట్స్... అతిమెత్తగా మృదువుగా నెమిలీకలాంటి టిష్యూ శుభ్రత... కల్చర్‌నర్... పేపరు పేపరే... నీళ్లు నీళ్లే...

రెండు నిముషాలకోమాటు...

'హీ' తెర్చుకుంటే యింకో రెణ్ణిముషాలకి 'షీ' నాప్తలీనూ యూరినేషనూ కలగలిసిన వాసన...

పో...పు...రీ!

"వాటే వుడ్యూ లైక్డు హ్యావ్ ప్లీజ్ ఎవిరీబడీ" రావ్

"చాప్ సూయీ" తను...

"ఫ్రైడ్ రైస్ విత్ చికన్ కర్రీ" నాదవినోదిని...

"మీరు సర్" రావ్...

"ఎలక్ట్రా లార్జ్ స్కాచ్ ఆన్ రాక్స్"

రావు భార్య అతని చెవిలో గుసగుసలు గారాలు పోయింది...

అపిటైజర్ సూప్‌లూ... స్కాచీ... వచ్చాయి. 'హీ' 'షీ'ల నాప్తలీనూ యూరినేషనూ వాసన్తో కలగలిసి...

పో... పు...రీ!

ఒక్కసారిగా పరిసరాల మీద నిరాసక్తత కలిగింది...

ఆరిపోయిన సాయంత్రంలాంటి అనుభూతి...

రావ్ నా భార్య దగ్గర పీఎచ్‌డీ చేస్తున్నాడు...

వినోదిని నా దగ్గర చేస్తోంది....

నేనూ తనూ కనికరిస్తే... డిగ్రీలు అవార్డు కూడా అయిపోతాయి త్వరలో... కానీ కావాలనే నేను డిలే చేస్తున్నా...

రావు విషయం కూడా అంతే...

నాకు తెలుసు ఇప్పుడీ బిల్లు మొత్తం రావు మోస్తాడు...

నేను డిలే చేయడానికి కారణాలు... (కారణాలు కాదు)

కారణం నాకు తెలుసు...

తను కూడా అదే కారణంతో రావునిబ్బంది పెడ్తోందా?

ఆ కుర్రాడికి మొన్ననే పెళ్లైంది...

వినోదినికింకా కాలేదు...

కాల్డర్ కైనటిక్ స్కల్ప్చర్‌తో తీగలకు వేళ్లాడే చిత్రమైన ఆకారాల్లా నా కోరిక వూగుతోంది...

వెరీ డెలికేట్లీ బ్యాలెన్స్డ్ ఎప్పుడు జారిపడ్తుందో నన్నట్టు...

నాలో ఊగిసలాట స్పష్టంగా కనబడ్తుంది, వినోదిని అది కనుక్కోలేనంత అమాయకురాలు కాదు...

మరి నా భార్యా?!

ఇదే అలెగ్జాండర్ కాల్డర్ స్టాటిక్ స్కల్ప్చర్‌లో వెల్డ్ చేసి అతికించిన ఇనుపముక్కలాగా సాదాసీదా... ఉదాసీనంగా...

యే అభిప్రాయమూ తెలీకుండా వుంటుంది...

"సర్ వన్మోర్ స్కాచ్ సర్?" రావు...

పదేళ్ల కింద పదిహేనేళ్ల పక్కింటమ్మాయి...
బిబ్లీయ మేనియక్‌నని చెప్పుకునే
నా భార్యా...
చదవని పుస్తకాలూ...
అసంగతాలూ...
ఉన్నట్టుండి... వేసవి మధ్యాహ్నం కురిసే
వడగళ్ల వానలా మహోధృతంగా తన్నుకొచ్చే
భావుకతా...
ఏమిటీ జీవితం...

"యా... థేంక్స్"

ఓ మూలకు ఆర్కెస్ట్రా ఆర్భాటంలేకుండా ప్లే చేస్తున్నారు...

మెదడు మీదకి పల్చటి మస్లిన్ మత్తు కప్పబడ్తోంది...

ఆర్కెస్ట్రా గ్రూప్లోంచీ వయొలనిస్ట్ వున్నట్టుండీ వివాల్డీ ఫోర్ సీజన్స్ లోంచీ ఓ బిట్ అపభ్రంశంగా వాయిస్తున్నాడు...

'హీ' 'షీ' తెరుచుకు మూసుకుంటున్నాయి...

పులుపు కోసం చికెన్ మీద వినెగర్ చల్లుకున్నాను...

వినోదిని చీకట్లోంచి మెరిసే అడవి కళ్లతో చూస్తోంది...

ఇజిగారి రాజమల్లు... సితార... బొగ్గుగనిలో పొర...

నా కోరికా... నా భార్య కోరికా...

అర్థంకాని తనంతో మగతనపు కొత్త వెచ్చదనాన్ని ఆస్వాదిస్తో రావు భార్యా...

నా భార్యలో కూడా నా కోరికేనా? విడని ప్రశ్నా...

అన్నీ జమిలిగా...

కలివిడిగా...

కలగలిసి...

నేనూ... నా తీగలు తెగిన సితార...

కాల్డరు కైనటిక్ స్కల్ప్చర్కి వూగుతూ నా కోరికా...

పదేళ్ల కింద పదిహేనేళ్ల పక్కింటమ్మాయి...

బిబ్లీయ మేనియక్‌నని చెప్పుకునే నా భార్యా...

చదవని పుస్తకాలూ...

అసంగతాలూ...

ఉన్నట్టుండి... వేసవి మధ్యాహ్నం కురిసే వడగళ్ల వానలా మహోధృతంగా తన్నుకొచ్చే భావుకతా...

ఏమిటీ జీవితం...

ఇజిగిరి రాజమల్లూ నువ్వు నాకంటే యిక్కడున్న నాగరికులందరిలో గొప్పవాడివి...

నీక్కావల్సిన సారానీ వదలక...

నీ మనసుకు దగ్గరైన సితారునూ వీడక...

ఆ రెండింటితో కలిసే వెళిపోయావు...

ఇజిగిరి వెళ్లిపోయుంటాడా?

వెళ్లిపోయుంటే... ఇక్కడ వివాల్డీని అపభ్రంశంగా వాయిస్తున్న వయొలెనిస్టును దండిస్తున్నదెవరు...

"రావ్... వన్మోర్లాజ్"

మసక... మస్లిన్‌పొర డెనిమ్ అయ్యింది....

పేపర్ న్యాప్కిన్మీద... అస్తవ్యస్తంగా రాసా...

"కతన కుతూ'ల'హం" బేరర్ ఆ న్యాప్కిన్ని వయలెనిస్టుకిచ్చాడు.

తలంతా కంగానీ...

పదిహేనేళ్ల పక్కింటమ్మాయి అదే పదేళ్ల క్రితం అదే రోజున

తెగిన నా సితారు తీగ...

రాతియుగంలో నేను...

అందులో 'హీ' 'షీ'లు పరిమళిస్తూ...

ఇజిగిరి రాజమల్లు బొగ్గు బావిలోకి సితారు పట్టుకు దిగుతున్నారు...

అన్నీ అందర కలిసిపోతున్నట్టు...

అంతా అలుక్కుపోయినట్టు...

పేపర్ న్యాప్కిన్మీద ప్రింట్...

నా వేల్లాడే కోరిక...

నా భార్య కోరిక కూడా అదేనేమో తెలియక...

పైకి లేచి గట్టిగా అరిచా...

"క...ల...గూ...ర... గం....పా"